# పొద్దుకెదురు తిరిగిన పువ్వు

ఒకరోజు సాయంత్రం ఇంటికి వొస్తున్నాను, పుష్ప విలాపం క్యాసెట్ పట్టుకొని. పైన ఒక్క మబ్బుతునకా లేని ఆకాశం. బాటకి ఇరువైపులా ఆవరించిన పచ్చని గడ్డిమీద, చిన్ని గాలికి అలకానందా అలలలాగా కదుల్తున్న రంగు రంగుల పేరు తెలియని చిన్ని చిన్ని పువ్వులు. కాశ్మీర సింధూరాన్ని గుర్తు చేస్తున్న పశ్చిమాకాశం నన్ను వూహల్లో ఆడిస్తున్నాయి. ఇంతలో వెనకాలనించి బలమైన చేతులు నా జడని పట్టుకున్నాయి.

గుంపులు గుంపులుగా దార్లో నిలబడి వచ్చిపోయే ఆడపిల్లల్ని అల్లరిచేసే స్థాయి నుండి జుత్తు పట్టుకునే స్థాయికి ఎదిగిపోయిన ఈ కుర్రాడెవరో అనుకుంటూ కోపంగా వెనక్కి తిరిగి చూసాను.

పచ్చని గుండ్రని ముఖంలో నీలి కళ్లు. గులాబీరంగు అధరాలు. ఒత్తయిన జుట్టు. పల్చని గెడ్డం. పాతికేళ్ల కుర్రాడు అమాయకమైన నవ్వు. ఆహ్లాదకరంగా కదుల్తున్న అతని మొహం చూసేటప్పటికి నా కోపమంతా పోయింది.

అతడీ దేశస్థుడు కాడు.

"నేనెప్పుడూ ఇంత పెద్ద జుట్టు చూడ్లేదు" అన్నాడు ఇంగ్లీషులో.

నే నవ్వాను.

"నయాగరా జలపాతంలా వుంది".

ప్రకృతిలో స్త్రీ సౌందర్యాన్ని పోల్చగలిగే పురుషులు సాధారణ వ్యక్తికంటే రవ్వంత ఎక్కువ వ్యక్తిత్వం వుంటుందని నా నమ్మకం.

"థాంక్యూ" అన్నాను.

అతను మెల్లిగా నా జుట్టు వొదిలి నా కళ్లల్లోకిచూస్తూ "మీపేరేంటి?" అడిగాడు.

"చంద్రకాంత".

"అర్థమేంటి?"

చెప్పాను.

మరోసారి నా జుట్టుని మెచ్చుకొని వెళ్లిపోయాడు.

దూరంగా నిలబడి వున్న ఓ గుంపులో కుర్రాడు "మాటలంటే వీళ్లకి ఇష్టం వుండదురా. ముట్టుకుంటే నవ్వుతూ ఎలా మాట్లాడిందో చూడరా" అంటున్నాడు.

అందరూ నవ్వారు.

'గొప్ప సత్యం కనిపెట్టాడు' అనుకుంటూ ఇంటివైపు నడిచాను.

★ ★ ★

ఇంటికి వెళ్లి వంటచేసి వినీల్ కోసం భోజనం సిద్ధంగా వుంచాను. వినీల్ వారం రోజుల క్రితం ఆఫీసు పనిమీద మా వూరినుండి ఇక్కడికి వచ్చాడు. మరో రెండు రోజుల్లో వెళ్లిపోతాడు. నే స్నానం చేసి జడ వేసుకుంటుంటే వినీల్ వచ్చాడు. వస్తూనే "ఇక్కడ ఈవ్ టీజింగ్ ఎక్కువగా వుంది" అన్నాడు.

"ప్రతిచోటా వుంది" అన్నాను.

"నీకు భయం వేయదూ!"

"ఎందుకు?"

"వాళ్లేడిపిస్తుంటే"

"ఒకరు ఏడిపిస్తే ఏడ్చే స్థితిలో నేనున్నానా?"

"పోలీసులకు వీళ్లందర్నీ అప్పచెప్పకూడదూ?"

నే నవ్వి "భోజనం చెయ్యి" అన్నాను.

టేబిల్ ముందు కూర్చుని "పెళ్లెప్పుడు చేసుకుంటావ్?" అడిగాడు.

నేనేం జవాబు చెప్పలేదు.

"మీ ఇంట్లో అందరూ నీ గురించే బెంగపడ్తున్నారు. ఊర్లో అందరూ చంద్రకాంతకి ఇంకెప్పుడు పెళ్లి చేస్తారని ఒకటే గోల చేస్తుంటే మీవాళ్లు బయటికి రాలేక కుమిలి పోతున్నారనుకో. వాళ్లకి ధైర్యం చెప్పి, నీ మనసులో ఏముందో తెల్సుకొని వస్తానని చెప్పాను. నీ మనసులో ఎవరైనా వున్నారా?" అడిగాడు.

"పెరుగు వడ్డించనా?"

"నువ్వేం భయపడొద్దు. ఎన్ని కష్టాలు ఎదురైనా సరే నీకు నే తోడుంటాను. నీ పెళ్లి జరిపిస్తాను. నీ మనసులో ఏముందో నిర్భయంగా చెప్పు" మృదువుగా అన్నాడు.

"నీకెందుకంత శ్రమ?"

"నా చిన్నప్పటినుండి నిన్ను చూస్తున్నాను. ఒకే వూరివాళ్లం. నువ్వు నాకు పరాయిదానివా? మనమధ్య దూరపు బంధుత్వం కూడా వుంది. నీ గురించి ఏమైనా చేస్తాను. శ్రమేంటి? నాకు ఆనందంగా వుంటుంది" అని ఆగి "నువ్వు ఒప్పుకుంటే నిన్ను

పెళ్లి చేసుకోడానికూ్కడా సిద్ధమే" అని చప్పున అన్నాడు.

'పర్లేదే! నా గురించి ఆలోచించడానికి, ఏమైనా చేయడానికి ఓ వ్యక్తి వున్నాడే' అనుకున్నాను.

"నీనుండి ఏమైనా సహాయం కావలిస్తే అడుగుతాన్లే" అన్నాను.

"నామీద నీ అభిప్రాయం ఏంటి?"

నే నవ్వి, ఏం జవాబు చెప్పలేదు.

★ ★ ★

మర్నాడు ఉదయం ఇంటిముందు ముగ్గు వేస్తుంటే ఎక్కడినుండో మౌతార్గన్ వాయిద్యం విన్పిస్తుంది. చుట్టూ చూసాను. ఎవరూ కన్పించలేదు. పైకి చూసాను. బాల్కనీలో పిట్టగోడకి ఆనుకొని నిన్నటి జడలాగిన కుర్రాడు వాయిస్తూ కన్పించాడు. నన్ను చూసి నవ్వుతూ "గుడ్ మార్నింగ్" అన్నాడు.

"అద్దెకి వచ్చారా?" అడిగాను.

"నెల్లాళ్లు వుంటాను".

"ఈ దేశం ఎందుకొచ్చారు?"

"ఇండియాలో స్త్రీ జీవితం అనే పుస్తకం రాస్తున్నాను. ఇక్కడ మీ జీవితాలు పరిశీలించాలని వచ్చాను" అన్నాడు.

"ఇండియాలో స్త్రీలు వుదయమే లేచి ఇంటిముందు ముగ్గు వేస్తారని రాస్తారా?" అడిగాను.

"ఉహూఁ... ఇండియాలో అమ్మాయిలకి జలపాతం లాంటి జుట్టుంటుందని రాస్తాను" అన్నాడు.

నే ముగ్గు వేయటం పూర్తిచేసి ఇంట్లోకి వచ్చాను.

★ ★ ★

ఆరోజు సాయంత్రం ఇంటికి వొస్తూ కాలేజీ అమ్మాయిల్ని, కాన్వెంట్ పిల్లల్ని చూస్తున్నాను. ఎంత హాయిగా నవ్వుతున్నారో. అలిసిన మనసుని స్పృశించే సన్నని పియానో రాగం లాంటి నవ్వుల్తో కదుల్తున్న వాళ్లని చూస్తూ అలసట, చికాకు, వ్యధ, ఒంటరితనాన్ని ఎవరైనా మర్చిపోవచ్చు. ఈ అహ్లాదకరమైన నవ్వుల కోసమే అబ్బాయిలు అలా కాలేజ్‌లు, స్కూళ్ల ముందు నిలబడతారా? అయివుండొచ్చు. నీలాకాశాన్ని, పచ్చని గిరులని, వెచ్చని రవి కిరణాల్ని, చిన్ని చిన్ని పిట్టల్ని, తెల్లని పువ్వుల్ని ఎందుకు చూస్తాం?

రిలాక్సేషన్. రిక్రియేషన్.

ప్రకృతిలో ప్రకృతి పసిపిల్లల నవ్వులు. యవ్వనారంభంలో వున్న అమ్మాయిల అందం ప్రకృతినే పరిహసిస్తుంది. యవ్వనవంతుల సౌందర్యం ప్రకృతికి ముగ్ధత్వాన్ని కలిగిస్తుంది.

వీళ్లని వీక్షించటం తప్పుకాదు.

"కెవ్వ్"

"కెవ్వ్"

చప్పున తలతిప్పి చూసాను.

నలుగురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలని సైకిళ్లతో చుట్టుముట్టి ఏదో వాగుతున్నారు.

ఆ పిల్లలు బెదిరిపోయి అరుస్తున్నారు.

రోడ్డుమీద వెళ్తున్న చాలామంది దృష్టిని వాళ్లు ఆకర్షించారు. అయినా ఒక్కరూ ఆగలేదు.

పట్టపగలు నడిరోడ్డుపై ఆడపిల్లల్ని ఆవిధంగా అటకాయించిన ఆ నలుగురు సామాన్యులు కారని, వాళ్ల ధైర్యాన్ని, వాళ్ల వెనక వుండే సర్కిల్స్‌ని వూహిస్తూ చాలామంది అవసరమైన దానికంటే ఎక్కువ వేగంతో నడవసాగారు.

ఆ ముగ్గురు అమ్మాయిలు భయంతో వాళ్లని ఏం అన్లేక దిక్కుతోచక నిలబడి పోయారు.

వీళ్లందర్ని చూస్తూ ఆనందంగా కేరింతలు కొడ్తుందో గుంపు దూరంగా.

నే ఆగి వాళ్ల నలుగురి వైపు నడిచాను.

రోడ్డుమీద ఓ వ్యక్తి తమని పట్టించుకుందనే విషయం గుర్తించిన ఆ అమ్మాయిలు కాస్త ధైర్యం వచ్చి "బుద్ధి లేదా మీకు?" అన్నారు.

"ఉంది కాబట్టే మిమ్మల్ని పట్టుకుంది" అన్నాడో అబ్బాయి.

నేనో కుర్రాడి జుట్టు పట్టుకొని బలమంతా వుపయోగించి చాచి కొట్టాను చెంపపై.

అప్పుడు మూగారు జనం.

ఇంక నా అవసరం లేకపోయింది.

వాళ్లే ఆ కుర్రాళ్లని చూసుకున్నారు.

గుంపునుండి బయటపడి ఇంటివైపు నడుస్తుంటే "నీకు బుద్ధుందా?" అంటూ నా వెనకే వచ్చాడు వినీల్.

నే తెల్లబోయి "ఎందుకు?" అన్నాను.

"ముక్కు ముఖం తెలియని ఆ అమ్మాయిల కోసం నువ్వెందుకిలా బజారు మనిషిలా రోడ్డుపై కుర్రాళ్లతో గొడవ పడాలి?" అన్నాడు కోపంగా.

ఓ మనిషి మరో మనిషికి తోడు నిలబడాలంటే పరిచయమే వుండాలా?

ఏమో! నాకు తెలియదు.

"నువ్వింతసేపు ఇక్కడే వున్నావా?"

"ఆఁ....."

"నే వాళ్లని కొట్టటం, వాళ్లు నాపై తిరగబడటం నువ్వు చూస్తూనే వున్నావా?"

"ఆఁ...." అన్నాడు వినీల్.

"రాలేదెందుకు నా దగ్గరికి?" అడిగాను.

"వీర నారిలా వాళ్ల మధ్యకి పోతుంటే నేనెందుకు రావాలి?"

"నాకే సహాయం కావల్సినా చేస్తానన్నావుగా"

"ఇటువంటిది సహాయం అనరు. బరితెగించటం అంటారు.

"నాకు బొత్తిగా చీరలు లేవ్. ఉన్న కాస్త మంచి చీర ఇదొక్కటే. ఇదీ ఈ గొడవతో మట్టికొట్టుకు పోయింది. ఓ చీర కావాలి" అన్నాను.

"ఒక్కటేమిటి ఖర్మ నీక్కావలిస్తే విమల్ షోరూమ్ నీ ఇంట్లో పెట్టిస్తాను" అన్నాడు గొప్పగా.

"వినీల్!" అంటూ నేనేదో చెప్పబోతుంటే "మనం ఇంట్లో మాట్లాడుకుందాం చంద్రకాంత. అందరూ మనల్నే చూస్తున్నారు. నీలాంటి అమ్మాయి నాకు తెల్సు అని పదిమందికి తెలియటం నాకిష్టం లేదు. ఇంకెప్పుడు ఇలా రోడ్డుపై మగవాళ్లతో ఘర్షణ పడకు" అంటూ వడివడిగా అడుగులు వేయబోతున్న అతడిని ఆపి "వినీల్! నాక్కావల్సింది చీరలు, నగలు కాదు. నా భావాలని అర్థం చేసుకొని, నా ఆనంద విషాదాలని సమానంగా తీసుకో గలిగి, మానసికంగా నాకు తోడు నిల్చే వ్యక్తి కావాలి. చీరలు ఇవ్వటమే, తాళి కట్టటమే ఓ పెద్ద సహాయం అనుకుంటున్నావు నువ్వు. నీలాంటి వ్యక్తితో మాట్లాడి, ఆతిధ్యం ఇచ్చి నా టైమ్ వేస్ట్ చేసుకున్నందుకు బాధగా వుంది. ఇంకెప్పుడూ నన్ను పలకరించకు" అని ఇంటికెళ్లి తలుపు తీస్తుంటే మౌతార్గన్ అబ్బాయి "మీకు ధైర్యం వుందే" అన్నాడు.

"ఏం?"

"ఇండియన్ గాళ్స్ పిరికివాళ్లు అనుకున్నాను".

"స్త్రీ పిరికిది కాదు. ఆమెని ఆ స్థితికి తీసుకొచ్చాడు మగవాడు. ధైర్యంగా సమస్యని ఎదుర్కొంటే బరి తెగించటం అనటం మగవాడికి అలవాటు. ఆ మాటలు భరించలేక స్త్రీ తనలో తానే బాధపడ్తూ ఒద్దికైన పావురాయిలా బ్రతికేస్తుంది. వినీల్ లాంటి మగవాళ్లు ప్రతి ఇంట్లో వుంటారు. స్త్రీ ధైర్యాన్ని చూసి పురుషుడు పిచ్చి పిచ్చి వాగుడు వాగటం మానే స్థితికి పురుషుణ్ణి స్త్రీ తీసుకు వెళ్లాలి. ఇటువంటివి మీ పుస్తకంలో రాయండి. అంతేకాని మా జడలు, ముగ్గులు, పాతివ్రత్యం గురించి కాదు" అన్నాను.

అతను చిన్నగా నవ్వి మౌతార్గన్ వాయిస్తూ "తప్పకుండా!" అన్నాడు.

ఆ పుస్తకం చదివిన ఒక్క వ్యక్తైనా సరే వినిల్‌లా మాట్లాడటం మానితే ఆ మౌతార్గన్ కుర్రాడితో మాట్లాడినందుకు నాకు ప్రతిఫలం లభించినట్టే.

• *స్రవంతి వార పత్రిక, 13 ఏప్రిల్, 1989* •